


"ప్లీజ్ సౌజన్యా!"

మునివేళ్లతో గడ్డం పట్టుకుంటూ అర్థింపుగా చూశాడు సారథి.

బింకంగా తలటువేపు తిప్పుకుం దామె.

కలిపిన అన్నాన్ని ముద్దగా... ముద్దు ముద్దుగా భార్యనోటి కందించబోయాడు.

విసురుగా వొక్కతోపు తోసింది.

భళ్లుమంటూ నేలపైకి దొర్లి పోయింది పళ్లెం. కలిపిన అన్నమంతా చెల్లా చెదరైపోయింది!

"నా కొద్దంటుంటే విన్పించుకోరేం?"

ఉక్రోషంగా అక్కణ్ణుంచి పరుగెత్తింది సౌజన్య.

ఆమె మనసంతా చేదు తిన్నట్టుగా వుండటంతో అన్నం తిన్లేకపోయింది.

వికల మనస్కయై అలా యెంత సేపుండిపోయిందో!

అన్నం తినటం ముగించిన భర్త గబగబా డ్రస్ చేసుకొని సైకిల్ తోసుకుంటూ, బయటకడుగుపెడ్తూ తలతిప్పి భార్య మొహంలోకి చూశాడు.

అతడి అ చూపుల్లో కదలాడిన బాధ నామె గుర్తించే స్థితిలో లేదు.

దీర్ఘంగా నిట్టూరుస్తూ వెళ్లిపోయా డతను.

ధన్‌మంటూ తలుపు వేసుకుంది సౌజన్య.

మెల్లగా వంటగదిలోకొచ్చింది.

గదంతా చిందర వందరైన అన్నం...

మునిపంటితో పెదవి కొరుక్కుంటూ వొక్క క్షణం నిలబడిపోయిందలాగే. ఆ పైన ఆ అన్నాన్నంతా వో పేపర్లో కెత్తి చెత్తకుప్పపై పడవేసింది.

గదంతా తుడిచి శుభ్రం చేసింది.

ఓ. దరికి రాని, యెంతకూ తెగని ఈగల్లా ముసురుకుంటున్న ఆలోచనలకు తలవంచి మంచంపై మేను వాల్చింది.

'ఏన్నాళ్లిలా? అవును... కాదు... యెన్నేళ్లిలా? ఈ వెధవ బ్రతుకు? పచ్చడి మెతుకుల పాలైన గతిలేని మొండి బ్రతుకు ఛీ... ఛీ...

'భర్త వుద్యోగస్థుడన్న మాటేగాని, పుట్టికీ, స్వర్గానికీ అందని సంపాదన అతడిది!

ఎవరేజ్‌గా తీసుకుంటే నెల్లో పది హేనూ, ఇరవై రోజులు తప్పితే మిగతా ఆ ప్రతి పదీ, పదిహేను రోజులూ పచ్చడి మెతుకుల ప్రాప్తం తనకు తప్పదు!

అలా బయట కెక్కడికెళ్లినా ... చక్కటి యిళ్లూ కమ్మటి తిళ్లూ తన దృష్టికొస్తుంటాయి. ఇంతెందుకు? తన మిత్రురాళ్లందరూ తనకన్నా హాయిగా బ్రతుకుతున్నారు. తనకీ ఖర్మ యేమిటో?

అసలు చిన్ననాటి నుండీ తిండికీ బట్టకీ నలగని స్థితిగతులు తమవి. యే నాడూ వస్తు మాటటుంచి యీ పచ్చడి మెతుకుల పాలిట పడలేదు.. కమ్మగా తిని పెరిగిన మధ్య తరగతికన్నా పై తరగతి గతం తనది.

అనుకోని విధంగా తండ్రి ఆర్థిక స్థితిగతు లడుగంటి పోవటంతో... (భర్త దృష్టిలో మాత్రం ఆడంబరాలకు పోవటంతో... అతడామాటనటంతో. తనక్కోపం రావటంతో సరి) తన్నీ చిన్న వుద్యోగస్థుడి చేతుల్లో పెట్టాడు తన తండ్రి.

నెల్లో వారం... పదిరోజులు కారం కూడు తినంది అడ్జస్ట్‌కాని దౌర్భాగ్యపు బ్రతుకై పోయింది!'


బుగ్గలపై జారిన కన్నీళ్ల నొత్తు కుంటూ... మంచంపై మరోపక్క కొత్తిగిలిందామె.

"చిత్రం... ప్రొద్దుట్నుండీ యేమీ.. యేమిటి నా మొహం... ఆ కంట్రోలు కారం మెతుకులేగా... తినకపోయినా తన కాకలిగా లేనేలేదు. బాధతో, తీరని కోర్కెల భారంతో ఎండిపోయిందీనాడు పూర్తిగా తన కడుపు.

ఈ పచ్చడి మెతుకుల ప్రహసనకు తనొక్కదాన్నే యెందుకిలా తరిమి తరిమి కొడ్తుంది?

అంటే తన వుద్దేశం పూరి మంది నంతా అది బాధించాలని కాదు... సాక్షాత్తూ తన భర్త గురించే... అగ్ని సాక్షిగా తన మెళ్లో తాళిగట్టి, రెండు గదుల చిన్న పూరింట్లో కాపరం పెట్టి, నెల్లోని సగం రోజుల తీయదనాన్ని, మిగిలిన ఆ సగంరోజుల కారందనాన్ని కలిపి కలబోసుకుని, ఆ సగటు ముద్దను సంతృప్తిగా మ్రింగి త్రేన్చే సదరు భర్తగారి నెందుకు.. యెందుకు బాధించ లేకపోతుందీ బ్రతుకు తెరువు?

ఆదినుండీ ఆయనగారి కదే తిండి, అదే స్థితి మహాభాగ్యం కావచ్చు! పూట గడిస్తే కోట్లు గడించినట్టు బ్రతికిన కుటుంబం కావచ్చు!



కాని... కాని... మరి తను? తనలా కాదే? నేతిలో తిని నేతిలోనే చేయి కడిగిన సాంప్రదాయమట తమది! నాయనమ్మ చెప్పేది!

నేతి జిడ్డు వొదలదీస్తూ వేడినీళ్ల ధారకట్టిన తనచేతినే ప్రత్యక్ష సాక్ష్యంగా తలపోస్తూ, తండ్రి హయాంలో కూడా ఆ మాట తానింకా నమ్ముతూనే వచ్చింది!

ఆ నాటి వైభోగం, యీనాడు పరిచయస్తుల, స్నేహితుల యిళ్లల్లో అక్కడక్కడా కళ్లక్కట్టటంతో కన్నీళ్ల కానకట్ట కట్టలేకపోయేది!

ఛ... యిలా తిండికీ, బట్టకీ నలుగుతూ బ్రతుకుతూ రేపు... రేపంటూ కూడా ఆశలు పెంచుకోలేని, అటు త్రుంచుకోలేని నిస్సారమైన యీ బ్రతుకు లేకుంటేనేం? అస్తమానం ఆర్థిక కీచులాటల్తో తృప్తిలేని యీ జీవితం కొనసాగించకపోతేనేం?

తను బతికితేనేం? ఛస్తేనేం? బ్రతుకంతా యీ టెన్షన్ భరిస్తూ యింకా బ్రతకలేదు తను! అటుగాని యిటుగాని. ఆస్తిపాస్తు లవలేశమైనా లేని తన జీవితగతి యిక యింతే! ఏం చేయాలి? తానేం చేయాలి?

ఒక్కసారి... ఒకే ఒక్కసారి తెగిస్తే... యీ కష్టాలు, కన్నీళ్లు తనకుండవు! యీ పాడుజన్మ వొద్దుగాక వొద్దు తనకు!

మెల్లగా లేచింది సౌజన్య. అదురుతూన్న గుండె నదుపులో వుంచుకుంటూ వంటింట్లో కడుగు పెట్టింది. పగలే చీకటి! లైటు వేయబోయి, లైటు పోయిన మొండి హోల్డర్ తన బ్రతుకులాగే వెక్కిరించటంతో ఆగిపోయింది.

ఆరుదుగా తీసే వంటింటి కిటికీ తెరవబోయింది. బిగుసుకుపోయి వో పట్టాన రాలేదది. ఆ కిటికీ కవతలే... శుభ సుప్రభాతాన పరమ చెత్తకుప్ప సందర్శనం కావటం యిష్టంలేని సౌజన్య ఆ కిటికీ నెప్పుడూ బంధించే ఉంచుతుంది. ఎప్పుడో తప్ప దానితో పనే బడలే దామెకు.

బలంగా కిటికీ రెక్క లాగింది. పూర్తి కిటికీ తెరిచింది.

అంతలోనే కెవ్వుమన్న కేక.

చటుక్కున తలెత్తి అవతలకి చూసింది.

ఇద్దరు మనుషులు... ఓ చింపిరి తలా, మరో బోడితలా వొకటి పయ్యెద లేని యెదా. మరొకటి జాకెట్టు చీలిన యెదా... దుస్తుల్లేని... వుండీలేని ఆ అర్ధనగ్న స్వరూపాలు, ఆ ఆడబొమ్మలు యే అడ్వర్‌టైజ్‌మెంట్ల తాలూకూ అడ్రసులు కానే కావు.

ఆ అర్ధనగ్న రూపాలకన్నా (వుంటే) వాళ్ల అందచందాలకన్నా ముందు అడుగంటి కన్పిస్తున్న వాళ్ల కడుపులే మిన్నగా ముందు సాక్షాత్కరిస్తున్నాయి.

ఆ ఇద్దరి చేతుల్లోనూ పచ్చడి మెతుకులున్న వో కాగితం పొట్లాం...

కళ్లు పెద్దవిచేసి మరీ చూసింది సౌజన్య.

ఆ అన్నం తను తోసేసిన కంచంలోదే... అ మెతుకులు తను యెత్తి పారేసిన పచ్చడి మెతుకులే!

'నాకంటే... నాకంటూ' ఆ పొట్లాన్ని లాక్కుంటూ, కొట్టుకుంటూ, బూతులు తిట్టుకుంటూ, వొళ్ళు తెలీని స్థితిలో ఆకలే తెలిసిన ఆ స్థితిలో... బలప్రదర్శన జరుగుతున్న ఆ తరుణంలో... కాగితం చిరిగి, మెతుకులు నేలపై, కాదు...కాదు... పెంటదిబ్బపై రాలిపోగా. వాటికోసం వచ్చిన వూరకుక్కల్ని పారద్రోల్తూ, వంగి... వంగి... అందినంత వరకూ ఆ మెతుకుల్ని కతుకుతున్న ఆ జీవుల్ని చూస్తున్న సౌజన్య హృదయం మొట్టమొదటిసారిగా వికలమైపోయింది.

ఒంటినిండా దుస్తుల్లేకున్నా, చిపటకు అసలొంటికే బట్టల్లేకున్నా, మనుషుల్లా కాకున్నా మరో జంతువులానైనా బ్రతకగల మనుషులు... కడుపునిండా తిండి లేకుంటే అసలు తిండే దొరక్కుంటే... మనుషుల్తో కాదు సరికదా వూరకుక్కల్తో నైతం పోటీపడి పొట్టనింపుకు బ్రతకాలని చూస్తారే!


ఇది నిజం... తన కళ్ల ముందు నిల్చిన పచ్చి నిజం!

ఇది ఆకలి!

ఆకలికేదో కొత్త నిర్వచనం తెలిసిపోయిందామెకు.

సాటి మనుషుల్నా స్థితిలో చూస్తుంటే...

పిచ్చికుక్కల్తో పోటీపడని,



మనిషితోలు కప్పుకున్న సమాజపు పిచ్చికుక్కల పాలపడని. సిగ్గూ మానాభిమానాల్ని మరిపించే అర్ధనగ్నత్వాన్ని యెత్తుపల్లాల్ని, అడుగంటిన ఆ కటి కడుపు యెత్తిచూపించే నికృష్ట పరిస్థితుల్లో లేని... తన స్థితిగతులామె కళ్లముందు నిలిచాయి.

ఎలాగోలా కడుపారా తిండి... యేదో వొకటి... వొంటినిండా బట్ట!

తానెంత అదృష్టవంతురాలు!

సృష్టిలో ప్రతి ప్రాణీ ప్రాణానికి తెగించి బ్రతకాలనే చూస్తూంటే తనకా యోచనెందుకు రాలేకపోయింది?

భర్త యెన్నోసార్లనునయించాడు.

'లేని దానికోసం అర్రులు చాచటం అవివేకం సౌజన్యా! యెప్పటికప్పుడు వున్నదాంతోనే సంతృప్తి పడటం నేర్చుకుంటే మనిషెప్పుడూ పరిస్థితులకు బానిస కాడు. కలిమిలేముల్లో స్థిరత్వాన్ని కూడా కోల్పోడు! లోకంలో వున్నవాళ్ల

కంటే లేనివాళ్ల సంఖ్యే యెక్కువ మనకంటే వున్నవాళ్ల గురించి మనసు పాడుచేసుకోక మనకంటే హీనస్థితిలో నున్నవాళ్లనుకూడా మనతోటి మనుషులుగా గుర్తిస్తే బాధే వుండదు।

'అన్నట్టు... యీ పచ్చడి చాలా బావుందోయ్... కడుపు నిండిపోయింది।

అంటూ బ్రేవ్‌మని త్రేనుస్తూ... తనవేపు చూస్తూ...

'ఎవరు తిన్నా... యేది తిన్నా... కడుపు నిండేంతవరకే। ఆ కడుపు నిండేది చేసుకున్న ఫలహారాలతోనే గాదు, వేసుకున్న కూరలతోనే గాదు సౌజన్యా। దానికి సంతృప్తికూడా తోడవ్వాలి। అప్పుడే ఆ తిన్న తిండి కమ్మని రుచినిస్తుంది... సులభంగా జీర్ణమవుతుంది... అలాంటి ఆకలే మళ్లీ మళ్లీ వేస్తుంది।'

అంటూ ప్రేమగా తల నిమిరే భర్త రూపం కళ్లముందు కదలాడిందొక్కసారిగా।

అవును। తానిన్నాళ్లూ యెందరో బిచ్చగాళ్లని చూసింది- యెన్నో ఆకలి కేకల్ని, ఆకలి చావుల్ని విన్నది...

అది కేవలం కళ్లతో చూసిందే... చెవులతో విన్నదే। కాని... కాని... తన బ్రతుకునే తెగేదాకా లాగబోతూ మధనపడ్తున్న యీ క్షణంలోని యీ దృశ్యం తను హృదయంతోనే చూడగల్గింది।

హృదయానికి కళ్ళుంటాయని,

హృదయానికి చెవులుంటాయని... యిప్పుడే తెలిసి వచ్చింది।

ఆ అమూల్య జీవిత సత్యం తనకిప్పుడే అవగతమైంది। మబ్బు విడిన ఆకసంలా నిర్మల చిత్తంతో

తృప్తితో స్ఫూర్తినిచ్చిన మందహాస వదనంతో,

భర్త రాకకై ఆత్రంగా... ఆనందంగా... అలా మొదటిసారిగా యెదురు చూడసాగింది సౌజన్య.

